# ఉద్యోగ ధర్మం

"దేవా! దానియేలును క్షమించు అతడేం చేశాడో అతడికే తెలీదు!"

* * *

దానియేలు అంతవా డవుతాడని, తల్లిదండ్రులు కూడా అనుకోలేదు. ఎ బి సి డి లు నేర్పినతరవాత, ఏదన్న రీడరు ప్రారంభిస్తూ ఆశీర్వాదం అన్నమాటలు, యీ నాటికీ దానియేలుకు బాగా జ్ఞాపకం

"నీ తల్లదండ్రుల జీవితాల్నుంచి, నువ్వు భిన్నుడవుగా బ్రతుకుతావు"

ఆశీర్వాదం ఏమాట అన్నా, బైబిలు చదువుతున్నట్టే వుండేది

"దేవుడు నిన్ను రక్షించుగాక!" అన్నాడు ఆశీర్వాదం తను పోలీసుగా రిక్రూటు అయ్యేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పనప్పుడు

నిజంగానే దానియేలును దేవుడు కరుణించాడు ప్రథమ ప్రయత్నంలోనే పోలిసుగా ఉద్యోగం వేసుకున్నారు తల్లిదండ్రుల జీవితమార్గం నుంచి, వృత్తిధర్మం నుంచి కేవలంభిన్నమైన మరో కొత్తమార్గంలో అతడు కాలుపెట్టాడు

మరియమ్మ తనకు భార్య అవుతుందని అతడు కలలో కూడా నమ్మలేదు ఓ ఎకరం పొలం, వుద్యోగం చేస్తున్న అక్క, యిటికగోడల యిల్లు వున్న మరియమ్మ తలి దండ్రులు, తనకు ఆమెను యిస్తారని అతడు ఏనాడూ ఆశించ లేదు చర్చిలో అతడు ప్రార్థనకు వంగి నప్పుడు దేవుణ్ణి చాలా చాలా వరాలు కోరేవాడు కాని కోరనివల్లా రెండే రెండు వరాలు ఒకటి బొందితో స్వర్గానికి చేర్చమని, రెండు మరియమ్మను భార్యగా యిమ్మనీనూ

కాని, తను పోలీసుగా చేరిన ఐదో నెలలో బెల్టు నడు ముకు బిగించి, సొంతంగా కొనుక్కున్న సీమ బూట్లు తొడు క్కుని, ఖాకీ చొక్కాతో నిక్కరుతో పల్లెలోకి ప్రవేశించిన అరగంటకల్లా—అటునుంచి కబురు రానేవచ్చింది

తను ఆశ్చర్యపోయాడు, తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు పల్లెఅంతా ఆశ్చర్యపోయింది ఆశ్చర్యపడని వాడల్లా ఒక్క ఆశీర్వాదమే

"దేవుడు మిమ్ము కరుణించుగాక" అన్నాడు ఆశీర్వాదం చర్చిలో వివాహం జరిగిపోయింది

పదోరోజుకల్లా పోలీసులైన్‌లో మరియమ్మతో కాపరం పెట్టాడు దానియేలు అంతా సక్రమంగానే, తను అనుకున్న

మాదిరిగానే దేవుడు కరుణించిన విధంగానే జరిగిపోయింది ఓ నాలుగు నెల్లు

దానియేలు దయా ధర్మగుణాలు కలవాడు ఎడమ చెంప మీద కొడితే కుడిచెంప యివ్వాలనుకునే ఉదారబుద్ధి కల వాడు కాని, ఆనాడు తనే ఎడమూ కుడీ చెంపల్నే కాక-ఎక్కడ బడితే అక్కడ, బెల్టుతో కనబడిన వాడినల్లా బాదవలసి వచ్చింది

కొత్తసినిమా ఆ రోజునే ప్రారంభం బుక్కింగు దగ్గిర జనం తోపులాట, తొక్కిసలాటగా, చివరికి దెబ్బలాటగా పరిణ మించింది తను మరిద్దరితో డ్యూటీమీద వున్నాడు లాఠీ తిప్పడంతో ప్రారంభమై దాన్ని ఎవడో లాక్కుంటే నడుం బెల్టులాగి విసరవలసి వొచ్చింది తను కళ్ళు మూసుకునే విసి రాడు ఆ తొక్కిడిలో, గల్లంతులో, ఆ బెల్టు బకిల్ ఎవరో స్త్రీ కంటికి తగిలింది నెత్తురు!

జనం అతడిమీదికి విరుచుకుపడ్డారు స్టేషన్‌నుంచి ఓలారీవిండు రిజర్వువచ్చి అతణ్ణి రక్షించింది

దారిపొడుగునా, యింటికి చేరేవరకూ అతడికి ఒకటే భయం, దిగులు "ఆ స్త్రీ కన్ను పోంతంపోయిందేమో!"

మరియమ్మ ఓదార్చింది 'డ్యూటీ తప్పదుగదా' అన్నది ఇద్దరూ సిలువముందు వంగి ప్రార్థించారు

"కళ్ళు లేకపోతే ప్రపంచమే లేదు" అన్నది మరియమ్మ దానియేలు తలవంచుకు వూరుకున్నాడు

"నా ఎడంకన్ను చూడు ఎప్పుడో చిన్నతనంలో యింత తూటిపేడు పుచ్చుకున్నది ఈ నాటివరకూ ."

'ఆఁ!" అంటూ అదిరిపడ్డాడు దానియేలు

"ఇంతకాలంనుంచి నాకు చెప్పలేదేం?' అన్నాడు కోపంగా

"నాకే గుర్తుండదు ఈ రోజున యిది విన్నతర ... "

మరియమ్మ భర్త మొహంవంక మాచి ఆగిపోయింది దానియేలు ఆపాదమస్తకం వణికిపోతున్నాడు. అతడికళ్ళముందు ఆ ... తన బెల్టుదెబ్బకు గురైన స్త్రీ పమిటచెంగుతో వచ్చే నెత్తురు ఆపుకుంటూ రోదించడం కదుల్లాడింది

చిన్నబుడ్డి వెలుగులో అతడు భార్య కంటెని పరీక్షగా చూశాడు ఎడమకంటిలో నల్లని చిన్నమచ్చ పక్కగా ఓచిన్న కండి బద్దలాంటి కుదప

"ఇంతకాలంనుంచి చెప్పలేదేం?"

"నాకంట్లో ఏముందో నాకేం తెలుస్తుంది?'

మరసటిరోజునే దానియేలు ఏవో బజారు మందులు తెచ్చాడు నెలరోజులకల్లా, కంటిలో చిన్నపువ్వు, విపరీతమైన తలపోటు

ఆశీర్వాదం ఏదోపనిమీద అటువచ్చి ఆశీర్వదించాడు

"దేవుడు మిమ్ము కరుణించుగాక! తెలిసిన డాక్టరుకు చూపించండి" అన్నాడు

ఇద్దరు తెలిసిన డాక్టర్లు చేసిన రెండు ఆపరేషన్లతో, మరియమ్మ కన్ను గాజుకన్నుగా మారింది

దానియేలు దిగులుపడ్డాడు 'కొండమీద ప్రసంగం రోజుకు రెండుసార్లయినా చదవందే పడుకునే వాడుకాదు తను ఎవరి భార్యకన్నో పోగొట్టాడు తనభార్యకన్ను దేవుడుపోగొట్టాడు దేవుడు దయామయుడు వడ్డీతోకూడా ప్రతీకారం చేసి తీరుతాడు!

కాలం దొర్లిపోతోంది దానియేలు హెడ్ కానిస్టేబు లయాడు తోలుపటకా యినపబకిల్ తీసేసి, మెరిసే పికా పటకా యిత్తడి బకిల్ తగిలించాడు కాని మనస్సుకు శాంతి లేదు ఎప్పుడూ ఒకే దిగులు ఒకే అనుమానం డేవుడు చేసిన ఆ ప్రతీకారంతో తృప్తిపడి వూరుకుంటాడా ?

ఆ రోజు తిరిగి తను అసహ్యించుకునే భయపడే డ్యూటీకే వెళ్ళవలసి వచ్చింది హాస్పిటల్ యిచ్చే కోటాగుడ్డలకు వచ్చే జనాన్ని అదుపులో వుంచాలి

సరిగ్గా తను వాకిలి దాటబోయే సమయానికి మరియమ్మ వెనకనుంచి కేక వేసింది అపశకునం అనుకుంటూ దానియేలు నిలబడ్డాడు

"కోటాగుడ్డలు యిస్తున్నారంట!"

"అక్కడికే వెళ్తున్నాను"

"దొరికితే పదిగజాలు – లేకపోతే ఐదుగజాలైనా మల్లు కావాలి"

దానియేలు విసుక్కున్నాడు గడప యివతలికి వచ్చి నిల బడ్డాడు "మనకు వేరే కోటా యిస్తారు అక్కడ లాభం లేదు"

మరియమ్మ బతిమాలుతూన్న ధోరణిలో, గడప నానుకుని అన్నది–

"మనకు మల్లు యివ్వరు రోజూ కూరగాయలు తెచ్చే వెంకమ్మ కార్డు యిచ్చింది రవికలకు కావాలి"

దానియేలు గుండెలు వేగంగా కొట్టుకున్నాయ్ ఏవేవో దృశ్యాలు మనస్సులో మెదిలినై జనం తొక్కిసలాట-లారీలూ బెల్టులూ విసరవలసి రావొచ్చు ఏం జరగబోతోందో!!

"నేను తెచ్చే వీలు లేకు నువ్వు రావొద్దు"

మరియమ్మ జవాబు వినకుండానే చకచకా నడిచాడు ఏవో భూతం, సైతాన్ వెన్నంటి వస్తున్నట్టు తత్తర పడ్డాడు

అతడి భయం జమే అయింది హాస్పిటల్ కొట్టుకు ఓ అరపర్లాంగు యిటూ అటూ, కదిలేందుకూడా ఖాళీ లేనంతగా జనం

"దేవా! ఏపాపం జరక్కుండా చూడు" అని ప్రార్థించాడు దానియేలు కొట్టె తలుపు చెక్కల్ని ఒక్కదాన్ని మాత్రం తీయించి అడ్డంగా నుంచున్నాడు

"తోసుకోవటం తొక్కోవటంవల్ల లాభంలేదు ఒకొక్కళ్ళే రండి ముందు ఆడవాళ్ళకు"

మాట పూర్తికాకుండానే పెద్ద కేకలు జనం తోపులాట, తొక్కిసలాట

దానియేలు వళ్ళు మండింది మనస్సు నిండుగా మైకం కప్పింది ఒక్కగుంజుతో నడుంబెల్టు చేతులోకి వచ్చింది పక్కనవున్న యిద్దరు పోలీసుల్తో "కొట్టండి! వెనక్కునెట్టండి!" అంటూ బెల్టును ఎడాపెడా కళ్ళు మూసుకుని విసర సాగాడు

"అయ్యో! నాకన్ను!" అన్న స్త్రీ రోదనధ్వని అతడు కళ్ళు తెరిచాడు కాళ్ళల్లో పట్టు సడలింది కళ్ళు బైర్లు క్రమ్మినై తిరిగి లాఠీనిండుగా రిజరు పోలీసులు!

అరగంట తరవాత, కలలో నడుస్తున్నవాడిలా, తెలిసీ తెలియని మైకంలో దానియేలు యింటికి నడిచాడు

వాకిటిముందు ఓ చిన్నగుంపు లోపల ఐదారుగురు మనుషులు అతడు వాళ్ళెవర్నీ గమనించకుండానే సరాసరి లోపలికి వెళ్ళి, బెల్టు వూడదీసి ఓమూలకు విసిరాడు

"దేవుడు మిమ్ము కరుణించుగాక" ఆశీర్వాదం ఆశీర్వదించి అతడి భుజంమీద చేయి వేశాడు దానియేలు తెల్లబోయి చూశాడు

"భయపడకు! డాక్టరుకు కబురుపోయింది"

"ఎవరికోసం? ఎందుకు?" అతడి గొంతులో రోదన ధ్వని

"మరియమ్మ! నీ స్త్రీ! కంటిమీద బెల్టుదెబ్బ తగిలింది బకిల్ బాగా కంట్లో దిగింది"

'ఏకన్ను! ఏకన్ను!" దానియేలు కంపితస్వరంతో అంటూ భార్య ప్రక్కన కూర్చుని, తల ఆమెవైపుకు తిప్పుకున్నాడు

'ఎడమ కన్ను శల్యం లేనిది! కుడికన్ను దేవుడు "

దానియేలు జుగుప్సతో వెనక్కి తిరిగి చూశాడు ఆశీర్వాదం కుడిచేయి ఎత్తి ఆశీర్వదిస్తున్నాడు తను విసిరి దూరంగా పారవేసిన బెల్టు, గది మూల తాచుపాములా మెలికలు తిరుగుతూ, పాలిష్ అయిన యిత్తడి తళ తళల్లో తల తిప్పుతోంది